క్లుప్తంగా

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

శిరివెళ్ల: పంచాయతీ కార్యదర్శులపై కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు అన్నారు. శనివారం ఎంపీడీఓ శివమల్లేశ్వర ప్పకు పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో పంచాయతీ కార్యదర్శులపై కలెక్టర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు రమణభట్టు, చంద్రశేఖర్‌రెడ్డి, రవిశంకర్, మనోహర్ కోరారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): అయోధ్య కరసేవలో బలిదానమైన కొటారి సోదరులను స్మరించుకుంటూ భజరంగదళ్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బచ్చు సంతోష్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యువత మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని, మీ చర్య కారణంగా పలువురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. శిబిరంలో 30మంది భజరంగదళ్ కార్యకర్తలు రక్తదానం చేశారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, చంద్రమౌళీశ్వరరెడ్డి, కమ్మయ్య, బాబు, వెంకటసుబ్బయ్య, నాగిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిసెంబర్ 9న భగవద్గీత కంఠస్త పఠన పోటీలు

నంద్యాల(వ్యవసాయం): గీతా జయంతిని పురస్కరించుకొని డిసెంబర్ 9వ తేదీన స్థానిక పద్మావతినగర్‌లో శ్రీకృష్ణ మందిరంలో భగవద్గీత కంఠస్త పఠన పోటీలు ఉంటాయని తిరుమల తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ అధికారి మల్లు వెంకటరెడ్డి తెలిపారు.శనివారం స్థానిక పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. వివరాలకు సెల్ : 9059802265 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శనివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పనులు చేపట్టాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు. ఎంపీపీ బాలస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బొమ్మలసత్రం: వాహనదారులు రోడ్డుభద్రతా నియమాలు పాటించాలని జిల్లా పోలీసులు శనివారం విద్యార్థులతో సేఫ్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో విద్యార్థులు నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం నుంచి శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఉత్తర కొరియాకు చెందిన ఎంగరిడమ్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 40మంది తలసేమియా బాధితులకు పోషక విలువలు కలిగిన నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీ రామాలయ ఆవరణలో చైతన్య కళాభారతి అధ్యక్షుడు వాసగిరి విజయభాస్కర్ ఆధ్వర్యంలో సరుకులను అందజేశారు.

విజ్ఞాన కేంద్రాలు.. గ్రంథాలయాలు

- ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు
- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- విద్యార్థులకు వివిధ పోటీలు
- 20న ముగియనున్న వారోత్సవాలు



నంద్యాల శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గోస్పాడు: విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఏటా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14న ప్రారంభమై 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అందులో భాగంగా గ్రంథాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలో 30 గ్రంథాలయాలు ఉన్నాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులను జూనియర్, సీనియర్లుగా విభజించి వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కథలు, ఆటలు, క్విజ్, పాటలు, డాన్సులు, కంప్యూటర్ ,పుస్తక పఠనం తదితర పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందిస్తారు .

2,71,857 పుస్తకాలు....

జిల్లా పరిధిలోని 30 గ్రంథాలయాల్లో 2,71,857 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. నంద్యాల జిల్లాలో గ్రేడ్-2లో 7, గ్రేడ్ - 3లో 22 గ్రంథాలయాలు ఉన్నాయి. బేతంచెర్ల మండలం రంగాపురంలో గ్రామీణ గ్రంథాలయం ఉంది.

వారోత్సవ కార్యక్రమాల నిర్వహణ ఇలా....

ఈ నెల 14న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా.. 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశం. 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వ హించటం. 19న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వ హించి మహిళలను భాగస్వాములను చేయటం, 20న విద్యార్థులు, సభికులతో సామూహిక పుస్తక పఠనం , డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కల్పించటం, విజేతలకు బహుమతులు అందజేస్తారు.

వారోత్సవాలకు అందని నిధులు..

ఈ ఏడాది వారోత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాలేదు. రెండు మూడు రోజుల్లో నిధులపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారోత్సవాలకు సంబంధించిన ఖర్చులకు నిధులను మంజూరు చేశారు. అప్పట్లో గ్రేడ్-1 గ్రంథాలయాలకు రూ.15వేలు, గ్రేడ్-2కు రూ.11వేలు, గ్రేడ్-3కి రూ.8వేలు మంజూరైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

పఠనంపై ఆసక్తి పెంచడమే లక్ష్యం



చిన్నారులు, యువతలో పఠనంపై ఆసక్తి పెంచడమే లక్ష్యంగా గ్రంథాలయ సంస్థ పనిచేస్తుంది. గ్రంథాలయాల సేవలను చేరువ చేయడం కోసం గ్రంథాలయాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నాం.

– ప్రకాశ్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

ఆలయాల్లో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



ప్రథమనంది ఆలయంలో జడ్జి దంపతులకు ఆశీర్వచనం పలుకుతున్న అర్చకులు

నంద్యాల(వ్యవసాయం): కర్నూలు ఉమ్మడి జిల్లా జడ్జి కబర్ది దంపతులు నంద్యాలలోని నవనందుల్లో మూడు నందులను శనివారం సాయంత్రం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో వెలసిన నాగనందీశ్వరుడిని దర్శించుకోగా.. ఆలయ ఈఓలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రథమనంది దేవస్థానంలో ఈఓ, నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం శాలువాతో సన్మానించారు. సోమనంది ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈఓలు వేణునాథరెడ్డి, రామానుజన్, కోర్టు సిబ్బంది నరేష్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ, సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ మినీ వర్కర్లకు, మెయిన్ వర్కర్లకు సమానంగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఏసురత్నం, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షేఖారాణి, నిర్మల డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలు చేస్తున్న అంగన్‌వాడీ మినీ వర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని, గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టుల్లో ప్రమోషన్లు, మినీ వర్కర్లకు అవకాశం కల్పించాలని, 42 సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలని, సర్వీసులో చనిపోయిన వారందరికీ మట్టి ఖర్చుల కింద రూ.20వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ రాంనాయక్, ఏఓ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ నాయకురాళ్లు సరస్వతి, రమణమ్మ, సునిత, శ్రీదేవి, అంకమ్మ, భాగ్యమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వదలని వర్షం.. రైతులకు నష్టం



రూపనగుడి- మాయలూరు మార్గంలో నేలవాలిన వరి పైరు



నర్సాపురంలో నేలవాలిన వరిని చూపుతున్న రైతు

ఉయ్యాలవాడ: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడులు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం ముంచేసిందని రైతులు లబోదిబోమంటున్నారు. గురువారం రాత్రి నుంచి శనివారం వరకు పెద్దగా గాలులు వీస్తూ వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్‌లో మండల పరిధిలోని కుందూనది తీరం వెంట 14 గ్రామాల్లో 1,052 హెక్టార్లలో వరి సాగు చేశారు. సుమారు 250 హెక్టార్ల పరిధిలో వరి పంట నేలవాలింది. పొలాల వైపు వెళ్లిన రైతులు అక్కడ పరిస్థితిని చూసి కుదేలయ్యారు. కంకి దశలో ఉన్న వరి నేలవాలగా, పైరు వచ్చే దిగుబడులు రంగు మారుతాయన్న భయం రైతుల్లో నెలకొంది. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాయలూరు, రూపనగుడి, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, తదితర గ్రామాల రైతులు వరి సాగు చేసి నష్టపోయామని వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డిని సంప్రదించగా దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. తుపాన్ ప్రభావం తగ్గిన తరువాత క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తామని వివరించారు.

ముంచిన వర్షం

రుద్రవరం: మండలంలో శుక్ర, శనివారం ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురవడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు సుమారు 5వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. నర్సాపురం, చిత్రేనిపల్లె, ఆలమూరు, ముకుందాపురం, హరినగరం, తిప్పారెడ్డిపల్లె, నల్లవాగుపల్లె తదితర గ్రామాల్లో కాస్త ముందుగా వరి సాగు చేశారు. కోత దశలో అల్పపీడన ప్రభావం దెబ్బతీసింది. మోస్తరు వర్షాలకు గాలులు తోడవడంతో వరి పైరు నేలవాలింది. శనివారం పొలాలకు వెళ్లిన రైతులు వరిని చూసి లబోదిబోమన్నారు. ఒకటిరెండు రోజుల్లో కోతలు ఉంటాయన్న తరుణంలో ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేలవాలిన వరిని కోసేందుకు అదనపు ఖర్చు అవుతుందని, పైగా ధాన్యానికి ధర అంతంత మాత్రంగానే ఉందని వాపోయారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు తైక్వాండో పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన 69వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో సోని, భవ్యశ్రీలు పాల్గొన్నారు. జాతీయస్థాయిలో రాణించిన బాలికలతో పాటు పీడీ శ్రీధర్‌లను హెచ్‌ఎం అదిలక్ష్మమ్మ శనివారం అభినందించారు. ఉపాధ్యాయులు ఓబులేసు, నాగరాజు, గంగాధర్, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధి మనందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మండల అభివృద్ధి మన అందరి బాధ్యత అని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను వినిపించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులపై గ్రామస్తులను అప్రమత్తం చేసి వ్యాధులకు గురికాకుండా ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వైస్ ఎంపీపీలు నాసారి ప్రసాద్, కొలిమి దాదాపీర్, ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలి



సిబ్బందితో చర్చిస్తున్న డ్వామా పీడీ జనార్దనరావు

ఆళ్లగడ్డ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జనార్దనరావు అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరి జాబ్‌కార్డు వారి దగ్గరే ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో ఏ మాత్రం నాణ్యత ప్రమాణాలు లోపించినా క్షేత్ర స్థాయి అధికారులతే బాధ్యత అన్నారు. జిల్లాలో 850 మినీ గోకులాలు నిర్మించాలని లక్ష్యం కాగా 630 మంజూరు చేశామని తెలిపారు. ఇందులో 268 నిర్మాణాలు మొదలు పెట్టినట్లు చెప్పారు. రూ 85.8 కోట్ల నిధులతో 1,026 సీసీ రోడ్ల పనులకు ఆమోదం లభించిందన్నారు. ఇందులో 740 పనులు మొదలు పెట్టగా వివిధ దశలో ఉన్నాయన్నారు. ఇప్పటికే 71 సీసీ రోడ్లు పూర్తయ్యాని.. త్వరలో అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. ఏపీడీ సాంబశివరావు, ఏపీఓ గణేష్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్ రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి జిల్లా స్థాయిలో ఏసీలు, ఏపీఎంలకు, సీసీలకు, ఎల్‌సీలకు శనివారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మంచినీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంచినీటి నిర్వహణ, ఓడీఎఫ్ ప్లస్ ఘన,ద్రవ వ్యర్థాల రీసైక్లింగ్, జలజీవన్ మిషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి అవగాహన కల్పించారు. వెలుగు సీసీలు శ్రీనివాసులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తే నాణ్యమైన విద్యుత్



పెద్దయమ్మనూరులో విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు

ఉయ్యాలవాడ: గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు సహకరిస్తే మారుమూల గ్రామాలకు కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో నిల్వ చేసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయన్నారు. సమస్యను పరిష్కరించేందుకు త్రీపేస్ లైన్ ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో అభ్యంతరాలు తెలపకుండా అధికారులకు సహరించాలని కోరారు. జిల్లాలో మొదటి విడతగా 150 ఫీడర్లలో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఉయ్యాలవాడ మండలంలో ఇంజేడు ఫీడర్ కింద పనులు ప్రారంభించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70 చోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. డోన్ ఏఈ క్రిష్ణమూర్తి ఉన్నారు.

19 నుంచి ఆధార్ క్యాంప్‌లు

దొర్నిపాడు: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నారాయణ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఉమాపతినగరం, దొర్నిపాడు-1, 21, 22న డబ్ల్యూ గోవిందిన్నె, దొర్నిపాడు-2, 26, 27వ తేదీల్లో డబ్ల్యూకొత్తపల్లె, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, 28, 29న క్రిష్టిపాడు, చాకరాజువేముల గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

19నుంచి నైపుణ్య శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ నుంచి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా అనలిస్ట్ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఆ పై చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వంతో గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపడతారన్నారు. అర్హులైన యువతీ యువకులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యార్హతలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ : 9182217075 నంబరులో సంప్రదించాలన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ఉద్యమాలు

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ, మహిళా డిగ్రీ కళాశాల, టీటీసీ బీఈడీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలకు నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సురేష్, ఎర్రిస్వామి, ఉదయ్, రంగరత్నం, వినోద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఖాతాలు తప్పనిసరి



అవగాహన ర్యాలీలో పోస్టల్ అధికారులు, ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్ ఖాతాలు ఉండాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎన్‌సీపీఐ ఖాతాలపై పోస్టల్ శాఖ అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్యాస్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, స్టూడెంట్ స్కాలర్‌షిప్, తదితర సంక్షేమ పథకాలు అందాలంటే పోస్టాఫీస్‌లో ఎన్‌సీపీఐ ఖాతా తెరవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్, భాస్కరరావు, గురువయ్య, పెద్దరాజు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ నేతలను స్మరించుకోవాలి



గాడిచర్లకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ: దేశ స్వాతంత్ర్యం, గ్రంథాలయాలు నెలకొల్పేందుకు త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రంథాలయాధికారిణి సంగీతలక్ష్మి అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం స్థానిక గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఎస్ రంగనాథన్, పోతూరి నాగభూషణం, ఐఎన్‌జీ వెంకటరమణయ్య చిత్రపటాలకు విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు.

ప్రముఖులకు నివాళి

దొర్నిపాడు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, నాగభూషణం, ఐఎన్ వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు గ్రంథాలయాధికారి అఖిలబేగం, విద్యార్థినులు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



ఇంజేడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని ఇంజేడు, సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి, అభయాంజనేయస్వామికి భక్తులు ఉదయాన్నే అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు అనంతయ్య, కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, భాస్కర శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

కనోహింగ్, కయోకింగ్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక చిన్నచెరువులో రాష్ట్రస్థాయి కనోహింగ్, కయోకింగ్ రాష్ట్రస్థాయి పోటీలను శనివారం అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, ఫయాజ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల నుంచి 130మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. పోటీలు ఆదివారం ముగుస్తాయని చెప్పారు. నంద్యాల జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ, అపర్ణ పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన క్రీడాకారులు